క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మతసామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

ఐఎంఏ అధ్యక్షురాలిగా డాక్టర్ శిల్ప



స్థానిక ఐఎంఏ నూతన కార్యవర్గ సభ్యులతో పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు

ఎమ్మిగనూరుటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఎమ్మిగనూరు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఐఎంఏ పూర్వపు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గౌడప్పగౌడ్, డాక్టర్ మాల కొండయ్యలు గురువారం ప్రకటించారు. అధ్యక్షురాలిగా డాక్టర్ శిల్ప, కార్యదర్శిగా డాక్టర్ కార్తీక్, సహాయకార్యదర్శిగా డాక్టర్ చంద్రకుమార్, కోశాధికారిగా డాక్టర్ శ్రీనివాస్ నియమితులయ్యారు.

కార్మికుడి కుటుంబానికి సాయం



మృతుని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్‌గా పనిచేస్తున్న బాషా కొద్ది రోజుల క్రితం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ బాధిత కుటుంబ సభ్యులను గురువారం స్థానిక కార్యాలయానికి పిలిపించి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్ బాషా అకాల మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే సాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: నవోదయం 2.0లో భాగంగా ఆదోని పట్టణంలోని రణమండల కొండల్లో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ గురువారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడులు చేసి 300 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఆదోనిలోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ లాలు అలియాస్ లాలుస్వామి అనే వ్యక్తిపై కేసు నమదు చేసినట్లు చెప్పారు.

మాల సురేష్‌కు పరామర్శ

ఆదోని రూరల్: పట్టణంలోని మధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లింగంపల్లి గ్రామానికి చెందిన మాల సురేష్‌ను గురువారం మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పది రోజుల క్రితం మాల సురేష్ పని నిమిత్తం పూజారి హనుమంతరాయుడి ఇంటి వద్దకు వెళ్లగా, నా ఇంటి వద్దకే వస్తావా అంటూ హనుమంతరాయుడుతో పాటు ఆయన కుమారుడు భాస్కర్‌ను కులం పేరుతో దూషించి మాల సురేష్‌పై దాడి చేసి గాయపరిచారన్నారు. పూజారి హనుమంతరాయుడు, అతడి కుమారుడు భాస్కర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీసులకు వారిని కోరారు. డివిజన్ యూత్ అధ్యక్షుడు వెంకటరాముడు, మాల మహానాడు కార్యదర్శి మల్లికార్జున తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని శివ సర్కిల్‌లోని బిర్యాని హోటళ్లతో పాటు పలు హోటళ్లను శానిటేషన్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆయా హోటళ్ల యజమానులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, శానిటరీ సెక్రటరీలు, మేస్రీలు పాల్గొన్నారు.



హాల్వి వద్ద కల్వర్టు దుస్థితి



గొతులదొడ్డి గ్రామం వద్ద పగిలిపోయిన కల్వర్టుపై రాయి పెట్టిన దృశ్యం



పాదలకుంట-హాల్వి మధ్యలో కల్వర్టుకు సూచికగా తాటిమట్టను పెట్టిన దృశ్యం

కూలేందుకు సిద్ధం!

- శిథిలావస్థలో కల్వర్టులు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు

కౌతాళం: మండలంలో వివిధ ఆర్‌అండ్‌బీ రోడ్లల్లో కల్వర్టులు పూర్తిగా దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు ఎప్పుడు చేపడుతారు అంటూ ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- గొతులదొడ్డి గ్రామం వద్ద ప్రధాన రహదారిలో డ్రైనేజి నీళ్ల కోసం వేసిన పైపు మధ్యలో పగలిపోవడంతో దానిపై రాయి పెట్టి రాకపోకలు సాగిస్తున్నారు. హాల్వి-నదిచాగి ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాత్రి పూట ఇక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బంటకుంట -సుళేకేరి గ్రామాల మధ్య కల్వర్టు పరిస్థితి

- పాదలకుంట హాల్వి గ్రామాల మధ్య కల్వర్టుకు గోడ పూర్తిగా శిథిలం కావడంతో కల్వర్టు ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితి బంటకుంట, సుళేకేరి గ్రామాల మధ్య కూడా నెలకుంది.
- హాల్వి గ్రామం వద్ద కల్వర్టుకు రంధ్రం పడడంతో ప్రయాణికులే ఇతరులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు తాటిమట్టను సూచికగా ఏర్పాటు చేసుకుని ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఏ రోడ్డు చూసినా ఇలాంటి పరిస్థితి నెలకుంది.
- కుంబళనూరు క్యాంపు వద్ద కొట్టుకుని పోయిన వంక కల్వర్టుకు మరమ్మతులు కూడా చేయక పోవడంతో నదిచాగి హాల్వి వద్ద రాక పోకలు పూర్తిగా స్తంభించి పోయి నెలరోజులైంది.
- కౌతాళం నుంచి బదినేహాల్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని కల్వర్టులు పలు చోట్ల కూలి పోయాయి. దీంతో ఈ రోడ్డుపైన వాహనాలు తిరగడం లేదు. కల్వర్టు కూలిపోయిన అధికారులు మరమ్మతులు చేపట్టక పోవడంతో రైతులే ఆ కల్వర్టు వద్ద గ్రావెల్ వేసుకుని తమ పంట పొలాలకు ట్రాక్టర్లు, ఎద్దుల బండులు వెళ్లే ఏర్పాటు చేసుకున్నారు.

ప్రతిపాదనలు పంపాం

సుళేకేరి, పాదలకుంట, పోతులదొడ్డి రోడ్లలో శిథిలమైన కల్వర్టుల మరమ్మతులు చేపట్టడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పోతుదొడ్డి గ్రామంలోని కల్వర్టుకు రూ.12 లక్షలు, సుళేకేరి కల్వర్టుకు రూ.14లక్షలు, పాదలకుంట, హాల్వి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టుకు రూ.13లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతామన్నారు.

– సాయి సురేష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

గోనెగండ్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. గురువారం మండలంలోని గోనెగండ్ల, హెచ్. కై రవాడి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఐ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యకు మించిన సంపద మరొకటి లేదన్నారు. చదువుమీదే దృష్టి సారించాలని, ఎలాంటి వ్యామోహాలకు లోనూ కాకూడదని సూచించారు. ఏదైనా సాధించినప్పుడే ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. మహిళ రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిని తెలుసుకొని మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

మంత్రాలయం/మంత్రాలయం రూరల్ / కోసిగి: మొహర్రం వేడుకలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. గురువారం మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో, కోసిగి మండలంలోని పల్లెపాడు, కోసిగిలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామంలో అందరూ కలిసి మెలసి వేడుకలు చేసుకోవాలని సూచించారు. పార్టీలకు అతీతంగా ముఖ్యంగా ఆధ్యాత్మిక భావనతో వేడుక జరుపుకోవాలన్నారు. ఎవరూ గొడవలకు పోవద్దని చెప్పారు. సీఐలు రామానుజులు, మంజునాథ్, ఎస్ఐలు విజయ్‌కుమార్, హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని సెంట్రల్ : ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని డీఎస్పీ హేమలత అన్నారు. పట్టణంలోని కిడ్డీస్ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలు, శక్తి టీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మన భవిష్యత్తును తీర్చిదిద్దేది చదువు మాత్రమేనని గుర్తు చేశారు. బాగా చదువుకొని ఉన్నత సాయికి ఎదిగితే స్వతంత్రంగా నిలబడ కలుగుతారని తెలిపారు. అప్పుడు వరకట్నం వంటి సమస్యలు ఉండవన్నారు. బాల్య వివాహాల వలన వచ్చే అనర్థాలను వివరించారు. ఎదైన సమస్యలు వచ్చినపుడు, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మంత్రాలయం రూరల్ : ఇటీవల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉంటాలని ఎస్ఐ శివాంజల్ అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లేనిపోనివి ఆశచూపి సైబర్ నేరగాళ్లు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని చెప్పారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి ఫోన్లు వస్తే జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీలు చెప్పడం వంటివి చేయరాదని సూచించారు. యూపీఐ కోడ్‌లను ఎంటర్ చేయడం కూడా చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: సైబర్ నేరాలపై జాగ్రత్తగా వుండాలని పట్టణ సీఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం పట్టణంలోని ఎస్ఎమ్ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో శక్తిటీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, శక్తియాప్, విద్యార్థినుల ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ మధుసూదన్, శక్తిటీం ఏఎస్ఐ నట్‌రాజ్, ఇన్‌చార్జ్ హెచ్ఎం మాబ్బాషా తదితరులు పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గోనెగండ్ల: ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే తమ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని ఎంపీపీ టీ. నసురుద్దీన్, వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి బండెనవాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలోని మొట్టివీధిలో ఎంపీపీ నిధులతో వేసిన సీసీ రోడ్డును వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడప గడప, తదితర నిధులతో మండలంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేయడం జరిగిందని గుర్తుచేశారు. మండలంలో ఎంపీపీ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు చికెన్ రాజా, నాయకులు మాబువలి, పద్మనాభం, నదిముల్లా, బండెనవాజ్, బగిలి హుసేన్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ టీ. నసురుద్దీన్, బండెనవాజ్

కౌతాళంలో 44.6 మిల్లీ మీటర్ల వర్షం



పెద్దకడబూరు వద్ద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలో బుధవారం కురిసిన వర్షం అత్యధికంగా కౌతాళం మండలంలో 44.6 మిల్లీ మీటర్లు నమోదు కాగా అత్యల్పంగా హోళగుంద మండలం 9.4మిల్లీ మీటర్లు నమోదైంది. పెద్దకడబూరు మండలంలో 43.6 మిల్లీ మీటర్లు, ఎమ్మిగనూరు మండలంలో 38.6 మిల్లీ మీటర్లు, గోనెగొండ్ల 25.6 మిల్లీ మీటర్లు, ఆదోని మండలంలో 21.6 మిల్లీ మీటర్లు, నందవరం మండలంలో 18.2 మిల్లీ మీటర్లు, మంత్రాలయం మండలంలో 13.6 మిల్లీ మీటర్లు, కోసిగి మండలంలో 12.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు విత్తనాలు మొలకెత్తేందుకు, ఇప్పటికే మొలకెత్తిన పైరు పెరుగుదలకు దోహదపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంలో రైతన్నలు

పెద్దకడబూరు : మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 43.6 ఎంఎంగా వర్షపాతం నమోదు అయ్యింది. పంట పొలాల్లో నీళ్లు నిలిచాయి. దీంతో మండలంలోని రైతులు ఆనందంలో మునిగిపోయారు. ఈ సారి ముందస్తుగా కురిసిన వర్షాలకు చాలామంది రైతులు ముందుగానే పత్తి పంటను అధికంగా సాగు చేసుకున్నారు. అయితే గత కొన్ని రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు ఎంతగానో ఎదురుచూశారు. ఈ వర్షానికి రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

ఎస్ఎస్ ట్యాంకు పరిశీలన

ఆదోని టౌన్: పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకును గురువారం ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ సతీష్, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, డీఈలు చలపతి, రామ్మూర్తి, గోపీనాథ్, ఏఈలు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎస్ఎస్ ట్యాంకులో నిల్వ ఉన్న నీరు ఎన్ని రోజులకు సరిపడతాయన్న వివరాలను ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్, డీఈలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న ఎస్ఎస్ ట్యాంకు గట్టు తాత్కాలిక నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆదోనికి తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. వచ్చే వేసవినాటికి శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని ఎస్ఈకి సూచించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే లైనింగ్ పనులు బాగా దెబ్బతిన్నాయని, ప్రత్యేక నిధులతో లైనింగ్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఘనంగా సుత్తం దేవర



కడ్లేగూడు పీరు ఊరేగింపు

కౌతాళం: మొహర్రం వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి మండల కేంద్రమైన కౌతాళంలో కొలువైన కడ్లేగూడు పీర్ల సుత్తం దేవర (చిన్న సరిగెత్తు) వైభవంగా సాగింది. స్థానిక కాకీ పీర్ వీధి నుంచి గ్రామ పూర విధుల గుండా పీర్ల ఊరేగింపు నిర్వహించారు. జామియా మసీదు మీదుగా జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా వరకు ఊరేగింపు కొనసాగింది. ఇమామేఖాసీం (గంటెప్ప దేవర) సరిగెత్తు తెల్లవారు జామున ఉంటుందని దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు.

ప్రశాంతంగా వేలం పాటలు

నందవరం: మండల కేంద్రం నందవరంలో కమేళా, బండ్ల మెట్ట, వారాంతపు సంత మార్కెట్ నిర్వహణకు డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు వేలం పాట నిర్వహించారు. గురువారం గ్రామంలోని సచివాలయం-1లో మండల అధికారుల నేతృత్వంలో వేలం పాట జరిగింది. దినసరి మార్కెట్, బండ్ల మెట్ట రూ.1,21,000, వారాంతపు సంత మార్కెట్ రూ.40,000 అదే గ్రామానికి చెందిన బాబు హెచ్చుపాడి హక్కులను దక్కించున్నారు. అలాగే కమేళా రూ.23,000కు నందవరం గ్రామానికి చెందిన మీసాల శాంతిరాజు హక్కులను పొందారు. వేలం పాట ద్వారా రూ.1,84,000 పంచాయతీకి ఆదాయం సమకురిందని డిప్యూటీ ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, రామారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: ఉద్యోగులు విధులతో పాటు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వీఆర్వోలు, గ్రామసేవలకు ఫిజియోథెరఫీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విధులు నిర్వహించే వీఆర్వోలు, గ్రామ సేవకులు నిత్యం ప్రజల్లో ఉంటూ సమయం చూసుకోకుండా విధులు నిర్వహిస్తుంటారని చెప్పారు. తమ విధులను నిర్వహిస్తు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, యోగా, ధ్యానంతో పాటు నొప్పులు ఉన్న వాళ్లు ఫిజియోథెరఫీ చేయించుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ వీరభద్రగౌడ్, ఎన్నికల డీటీ వలి, ఫిజియోథెరఫీ డాక్టర్లు పాల్గొన్నారు.

ఆస్తి విషయంలో ఘర్షణ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శిల్పా ఎస్టేట్ వద్ద ఆస్తి విషయంలో గురువారం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో పలువురికి గాయాలు అయ్యాయి. కోడుమూరు మండలం వర్కూర్ గ్రామానికి చెందిన తిప్పన్న తల్లి పాపమ్మ స్వగ్రామం ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల. పాపమ్మకు సంబంధించిన 4 ఎకరాల పొలం ఆమె తమ్ముడు కడిమెట్ల చెన్నప్ప సాగు చేసుకుంటున్నాడు. ఈ ఆస్తి విషయంలో పాపమ్మ కుమారుడు తిప్పన్న, కడిమెట్ల చెన్నప్పల మధ్య శిల్పా ఎస్టేట్‌లో ఓ నాయకుడి ఇంట్లో పంచాయతీ జరుగుతుండగా మాటమాట పెరిగి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దాడుల్లో తిప్పన్న, చెన్నప్పలతో పాటు మరి కొందరికి గాయాలు అయ్యాయి. ఇరు కుటుంబాలు కౌంటర్ కేసులు పెట్టుకోవటంతో రెండు కుటుంబాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు రాత్రి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న నాగలక్ష్మి టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతూ గురువారం మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనవంతుగా రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ చలపతి, ప్రహ్లాద్ చేతులమీదుగా అందించారు. భర్త ఈరన్నకు నగదు అందించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు ఆటో లక్ష్మన్న, మాదాస్, హనుమంతు, మనీ, నాగప్ప, పరమేష్, బండప్ప ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. ఇందులో భాగంగా కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యునియన్ నాయకులు నాగరాజు, ఇస్మాయిల్, కేశన్న, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ జిల్లా మేధావుల విభాగం ప్రధాన కార్యదర్శి గొర్లి నాగేశ్వర

కోసిగి: మంత్రాలయం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తానని పార్టీ జిల్లా మేధావుల విభాగం ప్రధాన కార్యదర్శి గొర్లి నాగేశ్వర అన్నారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని, పార్టీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ జిల్లా విభాగంలో కీలకపదవిని అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగ, దుద్ది గ్రామ నాయకులు హనుమంతు, వీరేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా మౌనిక



బుట్టా రేణుకతో జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా నియామకమైన మౌనిక

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామ సర్పంచ్, ఉన్నత విద్యావంతురాలైన వి.మౌనిక నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్రపార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక గురువారం తెలిపారు. ఈ మేరకు వి.మౌనిక ఇన్‌చార్జ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా మహిళా విభాగంలో తనకు పదవి ఇచ్చినందున పార్టీ అభ్యున్నతికి తన వంతుగా కృషి చేస్తామని తెలిపారు. తనకు పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతూల్‌కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కనకవీడు గ్రామానికి చెందిన బాలకృష్ణ వలంటీర్ విభాగం జిల్లా కార్యదర్శిగా నియామకమయ్యారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో స్థానం

నందవరం : వైఎస్సార్‌సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం వివిధ అనుబంధ విభాగాల కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. మండల పరిధిలోని హాలహర్వి గ్రామానికి చెందిన హజరత్ బిలాల్‌ను కర్నూలు జిల్లా గ్రీవెన్స్ విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శి నియమించింది. అలాగే నాగలదిన్నె గ్రామానికి చెందిన కే. రమేష్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా కమిటీల్లో బాధ్యతలు అప్పగించినందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎంపీ, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.